


# విజన్ ఉన్న సీఎంనే మళ్లీ ఎన్నుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మూల విజయారెడ్డి

గోదావరిఖని, అక్టోబర్ 28ః తెలంగాణ రాష్ట్రంపై మంచి విజన్, బంగారు తెలంగాణను సమర్ధవంతంగా తయారు చేసే శక్తి న్న కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయడానికి ప్రతి ఒక్కరూ నిర్ణయం తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి కోరారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శని వారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన తొమ్మిది సంవత్సరాలలో తెలంగాణలోని ఆడపడుచులు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ అనేక సంక్షేమ పథకాలతోపాటు మహిళలకు ప్రయోజనం కలిగే విధంగా అనేక పథకాలను రూపొందించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని నియోజ కవర్గంను దత్తత తీసుకుంటానని ప్రకటించిన కేటీఆర్‌ను అభినందిస్తూ అన్ని వర్గాల ప్రజలు రామగుండంలో కోరుకంటి చందర్‌ను మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు కృష్ణవేణి, జనగామ కవిత, గాదం విజయ, శాంత లక్ష్మీ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి

### ఎన్టీపీసీలో మహిళా ప్రతినిధుల సమావేశం

జ్యోతినగర్, అక్టోబర్ 28: రామగుండంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా శనివారం సాయంత్రం ఎన్టీపీసీలో ఓ ప్రవేటు ఫంక్షన్ హల్‌లో బీఆర్‌ఎస్ పట్టణ మహిళా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ గెలుపు లక్ష్యంగా మహిళా సోదరులు తెలంగాణ ఉద్యమ స్పూర్తితో ఇంటింటా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే నేడు ఆదివారం ఎన్టీపీసీలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన ప్రజా అంకింత యాత్రను విజయవంతం చేయ్యాలన్నారు. ఇక్కడ మున్సిపల్ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, క్రిష్ణవేణి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చెప్యాల రామారావు, ప్రధానకార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్, పట్టణంలోని 23, 4, 3, 2 డివిజన్‌లకు చెందిన మహిళా ప్రతినిధులు, నాయకురాళ్లు కుమ్మరి శారద, చంద్రకళ, ముడపు లక్ష్మీ, పెగడపల్లి విజయ ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఖని విద్యార్థిని ఎంపిక

కోల్‌సిటీ, అక్టోబర్ 28ః ఈనెల 30వ తేదీన సిద్ధిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు గోదావరిఖనికి చెందిన బాలిక జంగపల్లి సమీక్ష ఎంపికైనట్లు హెచ్‌ఎం జింక మల్లేష్ తెలిపారు. గోదావరిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సమీక్ష ఈనెల 27వ తేదీన నిర్వహించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని అత్యంత ప్రతిభను కనబర్చడంతో 30న సిద్ధిపేట జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. సమీక్షను పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ



బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పీట్ల గోపాల్‌ను పరామర్శిస్తున్న జడ్పీచైర్మన్ పుట్టమధు

పాలకుర్తి, అక్టోబర్28: పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు పీట్ల గోపాల్ కుటుంబాన్ని శనివారం జడ్పీచైర్మన్ పుట్టమధు పరామర్శించారు. గోపాల్ తల్లి పీట్ల ఎల్లమ్మ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి వ్యక్తచేశారు.

## ఆయిల్ ఫామ్ పంట లాభదాయకం

ఎలిగేడు, అక్టోబర్ 28: అన్నింటికంటే ఆయిల్ ఫామ్ పంట రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు, రైతులకు ఆయిల్ ఫామ్ పంట వేస్తే దానికి తోడుగా అందులో అంతర పంటలు వేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు ఈ పంట దోహదపడుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఐదెకరాల లోపుఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. ఇక్కడ మండల వ్యవసాయాధికారి ఎం ఉమాపతి, ఏఈవో గణేశ్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ రైతులు తదితరులున్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా అదనపు న్యాయమూర్తి డా।। టీ. శ్రీనివాస్ రావు

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 28 ః విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీస్ ఆథారీటీ చైర్మన్ డాక్టర్ టీ. శ్రీనివాస్‌రావు విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణములోని శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవల్సిన ఎంతో ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటు ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాయాలను సాధించుకోవాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులను గుర్తించి మంచి భవిష్యత్ కలిగించే దిశగా ముందుకు పోవాలన్నారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలు సాధించుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, న్యాయవాదులు అనురాధ, సదన్ కుమార్, గుడికందుల భూమయ్య, పెర్క మనోహర్, గోదావరిఖని రెండో సీఐ అఫలోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు హెల్ప్‌లైన్ గది ప్రారంభోత్సవం



కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో ఆదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, అక్టోబర్28: రామగుండం నియోజకవర్గంకు సంబంధించి ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా ఆదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ఓటరు హెల్ప్ లైన్ కోసం కంట్రోల్ గదిని ప్రారంభించారు. ఇకనుంచి ఓటరుకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ఈ హెల్ప్‌లైన్ అందుబాటులోకి రానుంది. ఇక్కడ రామగుండం తహశీల్దార్ జీ కుమారస్వామి, డిప్యూటీ తహశీల్దార్ కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## సౌత్ సెంట్రల్ రైల్వే ఎన్నికలో గుంపుల వాసి ఎన్నిక

ఓదెల, అక్టోబర్ 28: సౌత్ సెంట్రల్ రైల్వేలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఉప్పుల రాజయ్య ఎన్నికయ్యారు. ఈ నెల 19న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో– ఆపరేటీవ్ క్రెడిట్ సోసైటీ లిమిటెడ్ సికింద్రాబాద్ డివిజన్ ఎన్నికలు జరిగాయి. కాగా శుక్రవారం రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో 10వ నియోజకవర్గం (కాజీపేట్– బల్లార్షా)లో జరిగిన ఎన్నికల్లో ఎస్‌సీఆర్‌ఎంయూ డెలిగెట్‌గా గుంపులకు చెందిన రాజయ్య ఎన్నికయ్యారు. దీంతో స్వగ్రామం గుంపులలో శనివారం అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. రాజయ్య జమ్మికుంటలో ఉద్యోగం చేస్తున్నాడు.

## గొర్రెలు పంపిణీ చేయాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్28: రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు తీసిన వారందరికీ వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని యాదవ సంఘం నాయకులు మారం తిరుపతియాదవ్, గాజనవేన సదయ్య, తొట్ల రవి, బత్తిని లక్ష్మణ్, అల్లంల కొమురయ్య, జింక ఎల్లేశ్, వెంకట్రాజం, జక్కుల కుమార్, అల్లంల పోచాలు, ప్రభాకర్, కోరారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్28: ఎన్నికల నేపథ్యంలో మండలంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ దవాఖాన వద్ద శనివారం ఎస్ఐ శ్రీనివాస్ సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కాల్వశ్రీరాంపూర్ పోస్ట్‌ఆఫీస్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ రూ.2లక్షల విలువగలవి కారులో తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. వాటికి సరైన అధారాలు ఉండడంతో వదిలేసినట్లు ఎస్ఐ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

## పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన



జూలపల్లిలో పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న సీఐ జగదీశ్వర్

జూలపల్లి, అక్టోబర్ 28 ః మండలంలోని పోలింగ్ స్టేషన్లను శనివారం సుల్తానాబాద్ సీఐ జగదీశ్వర్, ఎస్ఐ వెంకటకృష్ణ పరిశీలించారు. ఎన్నికల అధికారులు మండలంలో 24 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో గాలి, వెలుతురు, విద్యుత్, ఫర్నీచర్ పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరం ఉన్నచోట గదుల్లో మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఓటర్లకు ఏ లాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు.

## ఈజీఎస్ పనుల తనిఖీ

జూలపల్లి, అక్టోబర్ 28 : మండలంలో 19 నెలల్లో చేపట్టిన ఈజీఎస్ పనులను శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో దాదాపు రూ. 4 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఇక్కడ ఎస్ఆర్పీ సాయిలు, డీఆర్పీలు కుమార్, కే. రమేశ్, జే. రమేశ్, ఏఈ సుమలత, ఏపీఎం సదానందం, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

ముత్తారం అక్టోబర్ 28 : మండలంలోని ఓడేడ్ గ్రామంలో గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ గురువయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు గ్రామ శివారులో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో బాగంగా 550 లీటర్ల బెల్లం పానకం , 20 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బెల్లం పానకం ద్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ సాయిరాం, సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

పెద్దపల్లి, అక్టోబర్28: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమైందున ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.